నెలనెలా రూ.1500 ఇవ్వాలి



సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ హామీల పేరుతో 18 ఏళ్ల నిండిన మహిళలకు రూ.1500 అందజేస్తామని చెప్పారు. కానీ ఇంత వరకు ఆ హామీ ఊసే ఎత్తలేదు. ఇచ్చిన హామీ మేరకు 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకూ పథకాన్ని అమలు చేయాలి.

– ఎం.స్నేహ, తలుపుల

పిల్లలను బడికి పంపలేం



చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇంటిలో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తానని ప్రకటించారు. చంద్రబాబు డబ్బు ఇస్తారన్న ఆశతో నా కుమారుడు రోహిత్(4వ తరగతి), కుమార్తె సైనిక(2వ తరగతి)ను నార్శింపల్లిలోని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాను. ఇప్పుడు ప్రభుత్వం డబ్బు జమ చేయకపోతే బడికి పంపలేం.

–బి.లక్ష్మి, గుమ్మళ్లకుంట, బత్తలపల్లి మండలం.

ఎప్పుడూ ఎదురుచూడలేదు



మా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెద్ద కుమారుడు శ్రీకాంత్ 10వ తరగతి, చిన్న కుమారుడు కిరణ్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి డబ్బు కోసం ఎప్పుడూ ఎదురుచూడలేదు. ఏటా జూన్‌లో నా ఖాతాలో అమ్మఒడి డబ్బు జమ చేసేవారు. కానీ ఇప్పుడు తల్లికి వందనం డబ్బు ఎప్పుడు పడుతుందో తెలియడం లేదు. – ఆసాది లలితమ్మ, దొన్నికోట, నల్లమాడ మండలం

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు



ఖరీఫ్ సీజన్ పూర్తయినా ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20 వేల సాయం ఇంకా ఇవ్వలేదు. ఇంత వరకు ఈ సాయంపై ఎటువంటి ప్రకటనా చేయకపోవడం బాధాకరం. రైతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి. రైతులంతా ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

– మోహన్‌రెడ్డి, రాళ్లనంతపురం, ముదిగుబ్బ మండలం

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి



ఇంటికో ఉద్యోగం లేదా అప్పటి వరకూ ఒక్కో నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని కూటమి నాయకులు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇంత వరకూ ప్రకటించలేదు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు మాట్లాడిన తీరును చూస్తుంటే 'నిరుద్యోగ భృతి' అమలు సందేహమే అని అనిపిస్తోంది.

– వై.ప్రశాంత్, వెలిచలమల, ఎస్.పీ.కుంట మండలం


జగన్ పాలనలో సకాలంలో 'రైతు భరోసా'



వైఎస్ జగన్ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 క్రమం తప్పకుండా అందేది. దీంతో పంటల సాగుకు ఇబ్బంది లేకుండా ఉండేది. దీంతోపాటు పంటల బీమా సకాలంలో వచ్చేది. దీంతో పాటు గ్రామంలోనే ఆర్బీకే ద్వారా ఎరువులు, విత్తనాలు అందేవి. ఈ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తోందో తెలియడం లేదు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి కన్పించడం లేదు.

– డి.శ్రీనివాసరెడ్డి, ఎస్. బడవాండ్లపల్లి, నల్లమాడ మండలం

సూపర్ వంచన!




- ఆచరణకు ఉపక్రమించని కూటమి ప్రభుత్వం
- కనీసం విధి,విధానాలు ప్రకటించని వైనం
- ఆందోళనలో అర్హులు

ధర్మవరం/ కదిరి/ పుట్టపర్తి: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్‌కు ఆకర్షితులై నిరుద్యోగులు, మహిళలు, రైతులు ఎంతో ఆశతో కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపి ఓట్లు వేసి గెలిపించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావస్తున్నప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు పథకాలకు సంబంధించిన గైడ్‌లైన్స్ కానీ, చేస్తామని కానీ ఎటువంటి కార్యాచరణ ప్రారంభించలేదు. దీంతో ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగాప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం ద్వారా బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15వేలు, రైతు లకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం, నిరుద్యోగులకు భృతి, మహిళలకు ప్రతి నెలా రూ.1500 పంపిణీ వంటి తదితర హామీలు ప్రధానంగా ఉన్నాయి. అసలే వరుస కరువులతో అల్లాడిపోతున్న పేద, మధ్యతరగతి ప్రజలు, రైతులు సత్వరమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతున్నారు.

- సూపర్ సిక్స్‌లో మరో పథకం ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు చొప్పున గ్యాస్ సిలిండర్ల పంపిణీ. ఈ పథకం కింద ధర్మవరం నియోజకవర్గంలో 82,432, పుట్టపర్తి నియోజకవర్గంలో 79,623, కదిరి నియోజకవర్గంలో 1,02,725 కుటుంబాల వారు గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురుచూస్తున్నారు.
- సూపర్ సిక్స్‌లో ఇంకో పథకం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం. ఈ పథకం కింద ధర్మవరం నియోజకవర్గంలో 1,23,974, పుట్టపర్తి నియోజకవర్గంలో 1,15,059, కదిరి నియోజకవర్గంలో 1,62,563 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం నిరీక్షిస్తున్నారు.

ప్రతి మహిళకి నెలకు రూ. 1,500




నియోజకవర్గం	అర్హులు	నెలకు ఇవ్వాల్సిన మొత్తం(రూ.లలో)
ధర్మవరం	98,709	14,80,63,500
పుట్టపర్తి	99,016	14,85,24,000
కదిరి	1,28,762	19,31,43,000

20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3000 నిరుద్యోగ భృతి



నియోజకవర్గం	అర్హులు	నెలకు ఇవ్వాల్సిన మొత్తం(రూ.లలో)
ధర్మవరం	1,02,052	30,61,56,000
పుట్టపర్తి	75,623	22,68,69,000
కదిరి	56,562	16,96,86,000

ప్రతి రైతుకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం



నియోజకవర్గం	అర్హులు	ఇవ్వాల్సిన మొత్తం (రూ.లలో)
ధర్మవరం	38,000	76,00,00,000
పుట్టపర్తి	45,824	91,64,80,000
కదిరి	46,838	93,67,60,000

స్కూలుకి వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000



నియోజకవర్గం	అర్హులు	ఇవ్వాల్సిన మొత్తం (రూ.లలో)
ధర్మవరం	48,807	73,21,05,000
పుట్టపర్తి	30,119	45,17,85,000
కదిరి	38,565	57,84,75,000

జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి అమలు ఇలా

నియోజకవర్గం	లబ్ధిదారులు	ఏడాదిలో లబ్ధి పొందిన మొత్తం (రూ.కోట్లలో)
ధర్మవరం	35,000	52.50
పుట్టపర్తి	24000	36.00
కదిరి	27,869	41.80



జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా అమలు ఇలా

నియోజకవర్గం	లబ్ధిదారుల	ఏడాదిలో లబ్ధి పొందిన మొత్తం(రూ.కోట్లలో)
ధర్మవరం	44,000	59.40
పుట్టపర్తి	45,000	60.75
కదిరి	46,838	63.23








మీ నమ్మకాన్ని వమ్ము చేయం

ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రస్తావించిన కందికుంట వెంకట ప్రసాద్



మీ అభిమానానికి సలాం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సుజాత

ధర్మవరం అర్బన్: లేపాక్షి నవోదయ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ధర్మవరం జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు రీతుశ్రీ, ప్రియదీప్తి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని జీవనజ్యోతి స్కూల్ హెచ్‌ఎం సుజాత తెలిపారు. బుధవారం ఆ విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ధర్మవరం: పట్టణంలోని యాదవ వీధిలోని ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం బుధవారం ఉదయం ఉన్నఫళంగా నేలకొరిగి అటుగా వెళ్తున్న ట్రాక్టర్‌పై పడింది. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కిందకు దూకేశాడు. స్తంభం నేలకొరిగిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజులు కిందకు పడిపోవడంతో విద్యుత్ ప్రసారం కాలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి లైన్లను సరి చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

గాండ్లపెంట: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని నల్లచెరువు సీడీపీఓ గంగరత్నమ్మ హెచ్చరించారు. గాండ్లపెంటలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు.

జాబ్ మేళా వాయిదా

కదిరి అర్బన్ : ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న జరగాల్సిన మెగా జాబ్ మేళా అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి జాబ్ మేళా తేదీని త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

శ్యామ్‌రెడ్డికి నివాళి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి(72) ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి తదితరులు బుధవారం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ భర్త గోవర్దన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు లేక కన్నీరు

- సత్యసాయి నీరందక దాహం కేకలు
- నెల రోజులుగా కటకటలే

బత్తలపల్లి: గ్రామీణ ప్రజలు దాహం కోసం అలమటిస్తున్నారు. తాగునీరు సరఫరా కాక కన్నీరు పెడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలో 42 గ్రామాలు ఉన్నాయి. ఇందులో 39 గ్రామాలకు సత్యసాయి నీటి సరఫరా పథకం, స్కీం బోర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. వీటికి తోడుగా 217 చేతిపంపుల్లో 102 బోర్లు పనిచేస్తున్నాయి. వీటి ద్వారానే నీటి అవసరాలు తీర్చుకోవాల్సి ఉంది. అయితే ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాల విడుదల తదితర డిమాండ్ల సాధన కోసం సత్యసాయి నీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మెబాట పట్టారు. 22 రోజుల తర్వాత సమ్మె విరమించారు. అయితే పూర్తిస్థాయిలో విధుల్లోకి రాలేదు. ఫలితంగా ప్రజలు తాగునీటికి కటకటలాడాల్సి పరిస్థితి నెలకొంది. మండల కేంద్రం బత్తలపల్లిలో శివాలయం వద్ద, నీటి శుద్ధి కేంద్రాల వద్ద వృథాగా పోతున్న నీటిని పట్టుకెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇంకొందరు వాటర్ ప్లాంట్ల వద్ద నీళ్ల కొనుగోలు చేస్తున్నారు. అవసరాలకు తగినంత నీరు కావాలంటే భారీగానే డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. కార్మికులు సమ్మెలోకి వెళితే ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని మహిళలు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం మండల కేంద్రంలో అధికారులు సత్యసాయి నీటిని కాసేపు వదిలారు. సమ్మె నేపథ్యంలో పైపులు ఎక్కడైనా దెబ్బతిన్నయా.. నీటి సరఫరాకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయో గుర్తించడానికి వదిలినట్లు తెలుస్తోంది. మరి పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో వేచి చూడాలి.



బత్తలపల్లిలో ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న మహిళలు

దిక్కుతోచడం లేదు



బత్తలపల్లి ఎస్సీ కాలనీలో సత్యసాయి నీరు, పంచాయతీ నీరు రెండూ రావడం లేదు. దీంతో నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొంత దూరం వెళ్లి అక్కడ నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఎవరికి చెప్పినా మా మొర వినిపించుకోలేదు. నీళ్లు లేకుంటే దిక్కు తోచడం లేదు.

-కాశమ్మ, ఎస్సీ కాలనీ, బత్తలపల్లి.

ముసలోళ్ల పరిస్థితి ఎలా..?



బాగుండేవాళ్లే నీళ్ల కోసం ఇబ్బందులు పడుతుంటే, మాలాంటి ముసలోళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి. మాకు ఎవరైనా సాయం చేసేందుకు ముందుకు రావాలన్నా మొదట నీరు రావాలి కదా. నీరే రాకుంటే మాకు సాయం ఎవ్వరు చేస్తారు? మా సమస్యలను గుర్తించాలని వేడుకుంటున్నాం.

-బాలపెద్దక్క, యల్లమ్మ కాలనీ, బత్తలపల్లి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం



సత్యసాయి కార్మికులు సమ్మె విరమించినా, వేతనాలు పడడం లేదని విధుల్లోకి రాలేదు. వారు రెండు రోజుల్లో నీరు వదిలే అవకాశం ఉంది. అయితే నీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ స్కీం బోర్ల ద్వారా నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి పంచాయతీలోనూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. కొన్ని బోర్లు నీళ్లు లేక డ్రై అయ్యాయి. అయినా ఇబ్బంది లేదు.

-వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, బత్తలపల్లి

సందడిగా మాహాలయ పౌర్ణమి

బత్తలపల్లి/ తాడిమర్రి/: మహాలయ పౌర్ణమి (మాల పున్నమిఃి) సందర్భంగా పల్లెల్లో సందడి నెలకొంది. పొలాల వద్ద జంతు బలులు ఇచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని రైతులు కోరుకున్నారు. పొలాల్లో జంతువులు బలి ఇవ్వడం, కోళ్ల కోసుకోవడం, కమురు(పొగ) వేయడం వంటివి చేశారు. బత్తలపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వేడుకలు సాగాయి.

- తాడిమర్రి, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, దాడితోట, మోదుగులకుంట, చిల్లవారిపల్లి, మరవపల్లి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో ప్రజలు మహాలయ పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. రైతులు పొలాల్లో కోళ్లు, పొట్టేళ్లను కోసి కమురు వేసి పంట పొలాలకు చల్లారు. ఇలా చేయడంతో పంటలు అధిక దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. అలాగే గొర్రెల మందల్లో కూడా పొట్టేళ్లను కోసి కమురు వేశారు. తాడిమర్రి ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బత్తలపల్లి పొలంలో పూజలు చేస్తున్న ఓ కుటుంబం

మలేషియా విద్యార్థుల సంగీత కచేరీ

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయానికి విచ్చేసిన మలేషియా బాలవికాస్ విద్యార్థులు బుధవారం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అంతకు ముందు శ్రీసత్యసాయి గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ మలేషియా సత్యసాయి సేవా సంస్థల ద్వారా మలేషియాలో అమలవుతున్న మల్టీ మీడియా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తిల చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు.

సరిహద్దులో ప్రత్యేక నిఘా

తనకల్లు: రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డీఎస్పీ శివనారాయణస్వామి ఆదేశించారు. తనకల్లు పోలీస్‌స్టేషన్‌ను కదిరి రూరల్ సీఐ నాగేంద్రతో కలిసి డీఎస్పీ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం వివిధ కేసులలో పట్టుబడిన వాహనాల వివరాలను ఎస్ఐ ధరణి బాబును అడిగి తెలుసుకున్నారు.

నల్లచెరువు: డీఎస్పీ శివనారాయణ స్వామి బుధవారం నల్లచెరువు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రశాంతంగా జీవించండి

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ సూచించారు. ఎస్సీ రత్న, బుధవారం తెల్లవారుజామున బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లిలో ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి కార్డన్‌సర్చ్, గ్రామసభ నిర్వహించారు.

ఉత్సాహంగా మారథాన్ రన్

పుట్టపర్తి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుక్కపట్నం బాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం మారథాన్ రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

నల్లచెరువు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్‌ఎస్‌డీ సొసైటీ కో ఆర్డినేటర్ గిరిజ అన్నారు. బుధవారం కేజీబీవీలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్ఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాల ప్రారంభం

కదిరి అర్బన్: ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఎస్‌టీఎస్ఈఆర్బీ నూతనంగా మంజూరు చేసిన రసాయన శాస్త్ర ప్రయోగశాలను ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత బుధవారం ప్రారంభించారు.

స్టార్టర్ల చోరులపై కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: ప్రభుత్వ ఆస్తులు, వస్తువులు ధ్వంసం చేసినా, స్టార్టర్లు, కేబుల్ చోరీ చేసినా అలాంటి వారిపై పోలీస్ కేసు పెట్టి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్, జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. బుధవారం 'సాక్షి'లో 'పంచాయతీ మోటారు కేబుల్, స్టార్టర్ల చోరీ' శీర్షికన కథనం రావడంతో స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

ఘనంగా గరుడోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం గరుడోత్సవం నిర్వహించారు. అలాగే మార్కెట్‌యార్డు సమీపంలోనున్న శ్రీరమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి సందర్భంగా అరుణాచల శివ నామస్మరణతో భక్తులు రమణ మహర్షికి పూజలు చేశారు.